# తీర్థపురాళ్ళు

- వివినమూర్తి

**భద్రాచలం తన తండ్రి పేరు పెట్టుకున్నాడు. ఆరోగ్యం తరువాత ఇద్దరు ఆడపిల్లల తర్వాత పుట్టిన బిడ్డకి - బ్రహ్మం అని, అతనితో పాటే వచ్చి కొట్టు మీద కూర్చోటంతో మొదలయింది బ్రహ్మం చిన్నతనం.**

## జరిగిన కథ

**తరతరాలుగా పేదలకూ, వెనుకబడిన వారికీ జరుగుతున్న అన్యాయలను చూస్తూ తానూ అందులో ఓ అభాగ్యుడై జీవితాన్ని కష్టాలకోర్చి ఒడ్డుకు చేరుస్తాడు భద్రాచలం. అతనికి చేదోడు వాదోడుగా నిలుస్తుంది నూకాలు. భద్రాచలానికి నాలుగు అక్షరం ముక్కలు నేర్పి లోకజ్ఞానాన్ని బోధిస్తాడు విశ్వనాథం. అతను పోతూ పోతూ తన దగ్గర ఉన్న పుస్తకాలను తీసుకొని వెళ్లి అమ్మి బతకమంటాడు. అక్కడనుంచీ అతనికో కొత్త జీవితం ప్రారంభం అవుతుంది.**

**వా**డి నరనరమూ పాటే - తరతరాల పూర్వీ కుల ఆర్తనాదం లాంటి పాటట - ఒకబ్బాయి బ్రహ్మం మీద కవిత్వం రాశాడు.

వాడు పాడుతూంటే - జనం ఆగిపోయి వినే వారు. ఉద్రేకంతో ఊగిపోయే వారు - కృష్ణక్కకి వాడంటే ఎంత వాత్సల్యం - ఆమె ఒక అజ్ఞాత మాతృమూర్తి విప్లవానికీ - విప్లవ భావాలకీ - విశాఖ విప్లవ హృదయానికీ...

పూసే పూసే చెట్టు పూత మీదే మాయమయినట్టు - బ్రహ్మం కొంత కాలం కనబడలేదు. అప్పుడప్పుడు వినబడే వాడు. వాళ్ళూ వీళ్ళూ చెప్పిన వార్త విని శాస్త్రిబాబు దగ్గరకు పరుగెత్తాడు భద్రాచలం. ఆయన ఓ రోజంతా అతన్ని వెంట బెట్టుకుని తిరిగాడు. సాయంకాలం చీకట్లో - ఇదే తీర్థపురాళ్ళ దగ్గర - తనను పొదివి పట్టుకుని - ''భద్రాచలం'' అన్నాడు.

అర్థమయింది -

పూత మీద చెట్టు నరికేయబడింది -

ఆయన ఏదేదో మాట్లాడుతున్నాడు.

ఎవరేమంటేనేం? లోకానికి వాడెంత వాడయితేనేం? తనకు బిడ్డ. తను ఉచ్చెత్తి, పియ్యెత్తి పెంచిన బిడ్డ - తను ముందు పాకి, అడుగులు వేసి, అమ్మా అత్తా అన్న బిడ్డ - ఏమయ్యాడు?

గొల్లుగొల్లుమన్న నూకాలే భద్రాచలానికి గుర్తు వచ్చింది.

యాక్సిడెంటు వేరు! రోగం వేరు! ఏ కోరికలూ తీరకపోవటం వేరు! ఇవన్నీ ఆ తల్లికి అర్థమవుతాయి. కాని - ఇదేంటిది? దొంగతనం చెయ్యలేదు! లంజతనం చెయ్యలేదు - ఎందుకు చనిపోయాడు నా బిడ్డ?

నూకాలు ప్రశ్నలకి జవాబు భద్రాచలం వద్ద లేకపోయింది. ఏ దేవుడూ, ఏ వైరాగ్యమూ, ఏ తర్కమూ ఆ తల్లికి జవాబు ఇవ్వలేకపోయాయి.

మంచానపడి - మళ్ళీ లేవలేదు నూకాలు.

'బ్రహ్మాన్ని చంపేసింది నువ్వే! నువ్వే!!'' అంటూ విలపించిన ఆరోగ్యం కళ్ళముందు మెదిలాడు.

ఆరోగ్యం మీద అంతకు ముందున్న కోపం బలహీనంగా రాజుకొంది. బ్రహ్మమే ఉంటే తన మనవడు రాహుల్‌గాడు ఇలా మాట్లాడగలిగేవాడా? విననట్టు ఊరుకొన్న ఆరోగ్యాన్ని - క్షమించేవాడా?

భద్రాచలం వృద్ధనరాలు తిరిగి మండసాగాయి.

ooo

''ఆరోగ్యమూర్తి ఆదినుంచే అదోరకం -'' అనుకున్నాడు భద్రాచలం.

చిన్నతనం నుంచీ ఆరోగ్యమూర్తి అనేక రకాల బాధలు పడ్డాడు. అయితే అతని బాధలకూ - తండ్రి బాధలకూ మౌలికంగా తేడా ఉంది.

భద్రాచలం బాధలు - 'బాధలు'గా గుర్తించే శక్తిని లేకుండా చేసి పెంచింది పల్లె.

ఆరోగ్యమూర్తి ఏమిటో, అతనిది ఎంత నికృష్టమైన పుట్టుకో అనుక్షణం గుర్తుచేసి పెంచింది పట్నం.

సెయింట్ ఆంథోనీ స్కూలులో చేరిన ఆరోగ్యం సెకండ్‌ఫారం చదువుతూండగా ఒక సంఘటన జరిగింది. రామశర్మ అనే మిత్రుడు కొందరు కుర్రాళ్ళను తన ఇంటికి పిలిచాడు. అతని తల్లి అందరికీ పళ్ళాలలో టిఫిన్ పెట్టింది. అందరినీ మంచాలమీద కూర్చోనిచ్చింది. అందులో ఒక ఆంగ్లో ఇండియన్ కుర్రాడున్నాడు. ముస్లిమ్ కుర్రాడున్నాడు. ఆరోగ్యానికి మాత్రం ఆకులో పెట్టి వీధిలో కూర్చోపెట్టి పెట్టింది ఆ తల్లి.

తినడం మానేసి, స్కూలుకి పరుగెత్తాడు. ఒక బ్రాహ్మణ మాస్టారు అతన్ని ఓదార్చాడు. ఆయన లెక్కలు చెపుతాడు. ఇంటికి తీసుకెళ్ళి తన మంచం మీద కూర్చోపెట్టి పళ్ళెంలో టిఫిన్ పెట్టాడు. ఇంత చేసినా, ఆయన తన పిల్లలకు బుద్ధి చెపుతూ - 'మాలాడే.' అయినా వాడికొచ్చిన లెక్కలు మీకు రావు - వాడికున్న బుద్ధి మీకు లేదు - అన్నాడు ఓ మారు. అది ఆరోగ్యానికి ఆ వయసుకే నచ్చలేదు.

'మాలాడు' అన్న పేరు తన శరీరంలో ఒక భాగంలా చేసి గుర్తించే మనుషులను తప్పించుకోటానికి అతను ఆ వయసులో ఒకదారి వెతుక్కున్నాడు. బాప్టిజం ఇచ్చి 'అన్నారం' అనే పేరుని మార్చి, 'ఆరోగ్యమూర్తి' అని పెట్టాడు ఓ ఫాదర్.

'ఎందుకురా మతం మార్చుకున్నావు కొడకా?'' అని అడిగింది నూకాలు.

''ఇంతకన్నా బాగా బతకాలని -'' అన్నాడు.

కొంతకాలం గడిచాక - ''నీ దేవుడు ఇంతకన్నా గొప్పరాత రాస్తాడంట్రా -?'' అని తండ్రి అడిగాడు.

''తెలీదు. మననిలా చస్తూ బతకమనే దేవుడు కన్నా మనకోసం రక్తం ధారపోసిన దేవుడు గొప్పవాడు -'' అని జవాబిచ్చాడు.

కొడుకు అలా మాట్లాడుతూంటే - తల్లీ, తండ్రీ భయపడ్డారు. పైనున్న దేముడికి నూకాలు భయపడితే, చుట్టూ వున్న మనుషులకి భద్రాచలం భయపడ్డాడు.

బాగా ఎదిగాక - దేవుడి మాట వచ్చినప్పుడు-

''తోటి మనుషుల్ని మనుషులుగానైనా గుర్తించనివ్వని మతాన్ని భరించలేక, మతం మార్చుకున్నాను



-'' అన్నాడు ఓ సందర్భంలో.

''తోటి మనుషుల్ని జంతువుల్లా భావించి ఆఫ్రికా నుంచి అమెరికాకి తొలిసారి ఎగుమతి చేసిన వ్యాపారి గొప్ప క్రీస్తు భక్తుడు. తన ధనాన్ని పేదలకి వెచ్చించిన వాడు తెలుసా! -'' అని ఓ కమ్యూనిస్టు మిత్రుడు అడిగితే.


''తప్పదు - ఎలక్షన్లున్న దేశంలో ఎవడో ఒకడికి ఓటెయ్యాలి - దేముళ్ళున్న ప్రపంచంలో ఏదో దేముడిని ఎంచుకోవాల్సిందే-'' అన్నాడు.

''ఎందుకా! 'దేముడు' ఈ దేశంలో మనుషుల 'ఎగో'లకి సింబల్. మాలాంటి వాళ్ళ పోరాటానికి, తలెత్తుకు నిలబడటానికి - ఆత్మగౌరవానికి - సింబల్స్ కావాలి'' అన్నాడు ఇంకోసారి.

ఇలా జీవితంలో ఎదిగినంత కాలమూ - ఆరోగ్యమూర్తి 'దేవుడు' గురించి ఆలోచిస్తూ, తన ఆలోచనలను ప్రకటిస్తూ, మారుతూ, మారుస్తూ ఎదిగాడు.

అందరు పిల్లల్లాగే -

ఆరోగ్యమూర్తి కూడా తన భావాలనూ, బాధలనూ తల్లిదండ్రులతోనే పంచుకోబోయాడు. అతని తెలివితేటలనూ, చురుకుదనాన్నీ కొందరు మాస్టర్లు ఎంతగానో మెచ్చుకునే వారు. సోషల్‌స్టడీస్‌లో అతనికి ఎప్పుడూ ఫస్ట్ మార్కే! ఆ మాస్టర్లు కూడా - 'ఏం తెలివండీ - ఆ కుర్రాడిది' అని మెచ్చు




కుంటే - ఓ మాస్టరు - 'క్రాస్ బ్రీడ్ మహిమ మాస్టారూ' అని పళ్ళికిలించాడు.

ఆ మాటకి - అర్థం తల్లిదండ్రులు చెప్పలేక పోయారు.

'మాలాళ్ళు - ఒక్కమారు కూడా రాజ్యం చేయలేదా?' అనడిగితే భద్రాచలమూ, నూకాలూ తెల్లమొహాలు వేశారు.

హైస్కూల్లోకి అడుగుపెట్టే సరికే - కోటా గాడు, ప్రభుత్వ దత్తపుత్రుడు' లాంటి పేర్లను అందుకుని - విననట్టు నటించగలిగినంత కాలం నటించాడు.

'- వీళ్ళు - ఇంజనీరింగ్ చదువుతారుట - కడుతూండగానే బ్రిడ్జిలు కూలిపోతాయి -'

'వీళ్ళు వైద్యాలు చేస్తారట - బతికుండగా వచ్చి వీళ్ళ చేతుల్లో చావకూడదని చేతులెత్తేస్తారు జనం-'

''గొడ్డు మాంసం తినే వాళ్ళకి నాలిక మందమై పోతుంది. శుద్ధమైన మాటలెలా వస్తాయి?'

ఇలా - తాము జోకులుగా భావించేసి విరగబడి నవ్వుకునే వాళ్ళు ఎదురైనప్పుడు వాళ్ళతో నవ్వలేక పోయాడు. తనకన్నా వయసులో పెద్దయిన వాళ్ళను తన్నాలన్న కోరిక ఆపుకోలేకపోయాడు -

అవన్నీ -

తల్లిదండ్రులతో చెప్పుకుని ఏడవగలిగినంత కాలం ఏడిచాడు. తొందరలోనే తన తల్లిదండ్రులు అతనికి అర్థమయిపోయారు - వాళ్ళకి తన మీద అంతులేనంత ప్రేమ. కాని- పెద్ద కులాలలో తల్లిదండ్రుల్లా వాళ్ళు తమ పిల్లలను వెనకేసుకు వచ్చి రక్షించుకోరు. తమ పిల్లలు - వాళ్ళ కోపాల్ని దాచుకోకపోతే - ఎవరికయినా తెలిసిపోతుందేమోనని బిగుసుకు పోతారు. ఆ భయం - వాళ్ళ మీద తరతరాలుగా జరుగుతున్న భౌతిక హింసవల్ల ఏర్పడినది. ఆ భయం - వాళ్ళకి సంతానం ఎదుర్కొనే ప్రశ్నలకు సరైన జవాబు ఇవ్వకుండా చేస్తుంది. బిడ్డల దుఃఖం పట్ల ఎంత అనుకంప ఉన్నా, ఆ భయం దానిని అణిచేస్తుంది.

దాంతో -

ఆరోగ్యం నటించటం మానేశాడు. ఏడవటం మానేశాడు. తల్లిదండ్రులతో పంచుకోటం మానేశాడు. వాళ్ళ పట్ల జాలిపడటం తప్ప - అర్థం చేసుకునే ప్రయత్నం మానేశాడు.

తన ఆలోచనలను తనతోనే ఉంచుకున్నాడు. తన వాళ్ళనుకున్న వాళ్ళతో పంచుకున్నాడు. అలా కొందరిని తన వెనక సేకరించుకున్నాడు.

హైస్కూలు చదువు పూర్తవుతూండగా - ఆరోగ్యానికి ఒకటే మార్గం కనిపించింది. చదువుకోవాలి. దానితోనే తన బాధల నుంచి విముక్తి లభిస్తుంది - అని గట్టిగా నమ్మాడు.

ఆ లక్ష్యంతోనే అతను చదివాడు. పీయూసీ అయింది. ఏవీయన్ కాలేజీలో డిగ్రీలో చేరాడు. చదువుకోడంతో తన నేపథ్యం మారుతుందా? అన్న సందేహానికి లోనయ్యాడు. పెద్ద చదువు చదివితే తన బాధలకు విముక్తి అని - తనను తను నమ్మించుకోబోయాడు.

'చరిత్ర'లో పీ.జీ.కోసం యూనివర్సిటీలో చేరాడు.

చేరిన కొంత కాలానికే - పెద్ద చదువుల వాళ్ళ చిన్న బుద్ధుల పట్ల అతనికి సంశయాలు మొదలయ్యాయి.

వయసులో ఎదిగిన వాళ్ళు - వ్యక్తిత్వంలో కూడా ఎదుగుతారన్న అడియాస అయింది.

మార్కులకోసం విద్యార్థులను పరుగెత్తించి, పదవులకోసం తాము పరుగెత్తుతూ గురువులు - భారతదేశపు ప్రత్యేకత అయిన కులం కల్పించే ఏగోలను, దురహంకారాలనూ తమతో పెంచి పోషించుకుంటూ - విద్యార్థులలో పెంచిపోషించటం గమనించాడు ఆరోగ్యమూర్తి.

చదువూ, పెద్ద చదువూ తనను సమాజంలో సమానుడిగా గుర్తింపు నిస్తాయన్నది ఓ భ్రమ - అనుకున్నాడు ఆరోగ్యమూర్తి.

అతను నిరాశకు గురయి, నిర్లిప్తతలోకి జారిపోయే వాడే కాని - అతనిలోని అంతర్గత శక్తులు అతన్ని వదలలేదు. కమ్యూనిజంలోకి వస్తూన్న రాడికల్ ఎలిమెంట్స్ యూనివర్సిటీలను చుట్టుముట్టడంతో ఆరోగ్యమూర్తి కూడా ప్రభావితుడయ్యాడు.

దాంతో -

యూనివర్శిటీ ప్రపంచం చీలికల్లోకి కూరుకుపోయాడు.

'మనం మాటకి మాట చెప్పాలి' అన్నారు కొందరు.

'అప్పుడు వాళ్ళు మనకి మాటల్తో జవాబులు చెప్పరు. దెబ్బ తీస్తారు. దెబ్బకి దెబ్బే సమాధానం' అన్నారు కమ్యూనిస్టులు.

'అప్పుడే- మన ఆత్మగౌరవం నిలబడుతుంది' అన్నాడు ఆరోగ్యం.

గొడవలు ముదిరాయి. తన్నులాటలు మొదలయ్యాయి.

చురుకైన వాడూ, స్వతంత్రంగా ఆలోచించగల వాడూ, తన ఆలోచనలను ఉపన్యాసాలలో ఆవేశాలూగా ప్రతిఫలించగల వాడూ అయిన ఆరోగ్యం చాలా వేగంగా పది మంది దృష్టికీ వచ్చాడు.

దాంతో ఆరోగ్యానికి రెండు రకాల సమస్యలు ఏర్పడ్డాయి.

అతను అనుసరించే వారితో ఒక రకం సమస్య ఏర్పడితే - అతను ఎదిరించే వారితో మరో రకమైన సమస్య ఏర్పడింది.

మొదటి రకం సమస్యకి మూలం అతని ప్రశ్నించే స్వభావం. అతని స్వతంత్ర సంశయాలు, వ్యక్తిత్వ సంబంధితమైన ఆ మూలాన్ని అతని కమ్యూనిస్టు మిత్రులు అలా తీసుకోలేకపోయారు. ప్రశ్నలు సంశయాలూ గల ఆరోగ్యమూర్తి - తమతో కడదాకా ప్రయాణిస్తాడా అని మాత్రం అనుకున్నారు. వాళ్ళ అనుమానపు చూపులు ఆరోగ్యమూర్తికి అర్థమయ్యాయి. ఆ చూపులకి కారణం 'తన కులమా!' అన్న ప్రశ్న ఆరోగ్యమూర్తిలో

కలిగింది. ఇదంతా బీజప్రాయంలో ఉండగానే -


రెండవ సమస్య ప్రధానమయింది -

లెనిన్ చౌదరి ప్రొఫెసర్. కమ్మ. ఆయన తండ్రి కృష్ణా జిల్లాలో కౌలుదారు. కమ్యూనిస్టు. ఆ తండ్రికి కమ్యూనిజం పట్ల అచంచలమైన విశ్వాసం. జమీందార్లతో పోరాడాడు. జమీందార్ల తరఫున నిలబడ్డ ప్రభుత్వ బలగాలతో పోరాడాడు. చాలాకాలం రహస్య జీవితం గడిపాడు. కుటుంబాలు కుటుంబాలే కమ్యూనిస్టు పోరాటాలకి అంకితమైన దినాల్లో - ఆయన సమైక్యతతో పోరాడుతూ - తన సోదరులు ఇద్దరినీ, ఒక కాలునీ పోగొట్టుకున్నాడు.

ఆ తర్వాత అతను రైతయ్యాడు. తన పేరులో 'నాయుడి' ని వదులుకున్నాడు. కొడుకుని కష్టపడి చదివించాడు. 'పోరాటాల' తండ్రినీ, పోరాటాలనీ చూసిన కొడుకు - తన ఊరిలో వస్తూన్న మార్పులని చూశాడు. 'తిరగబడటాన్ని' జీవితంగా మార్చుకున్న తండ్రి వీరత్వాన్ని ఎంతగా ఆరాధించాడో, ఆ 'తిరగబడటం' వల్ల అంతకాలమూ తమ చెప్పుచేతలలో ఉన్న వాళ్ళు ''తలలు ఎత్తుకోటాన్ని'' అంతగానూ అసహ్యించుకున్నాడు. తన కింద వాళ్ళు ఎంత కింద వాళ్ళో గుర్తు చేయటానికి చేతినీ, నోటినీ యధేచ్ఛగా ఉపయోగించటం నేర్చాడు. తన వాళ్ళనుకున్న వాళ్ళతో - అలా ఉపయోగించటం - ఒక 'సంస్కృతిగా' ఒక ప్రాంతపు 'జీవన సరళి'గా సిద్ధాంతం చెయ్యటం నేర్చాడు. తన పేరులో తండ్రి ఉంచని 'చౌదరి' ని - తగిలించుకోవటంలో ప్రయోజనాలున్నాయనిపించి - ఇటీవలే ఆ పని చేశాడు.

ఇవన్నీ - తండ్రికి కొడుకుని దూరం చేశాయి. 'తను చేసిన పోరాటాలు- జాతి విముక్తి పోరాటంలో భాగాలు కావని - తమ ప్రయోజనాల కోసమే చేసివున్న వాదనలు అతన్ని గాయపరిచాయి. కమ్యూనిస్టు పార్టీల్లో వచ్చిన, వస్తున్న మార్పులు ఆధిపత్యం తగువులేనని, సిద్ధాంత విభేదాలు కావని అతనికీ అనిపించసాగాక - ఆ గాయం మరింత బాధించింది. కొడుకులో వస్తున్న మార్పులు గమనించాక, ఆ తండ్రి కమ్యూనిజానికీ, కొడుకుకీ, అతని కార్యకలాపాలకీ దూరంగా తన ఊళ్ళో తన ఇంట్లో, తన గదిలో, తనలోతనే అయి ఆధ్యాత్మిక జీవితంలో మునిగిపోయాడు.

తండ్రి తనకు దూరమయినా, అతనిలో 'వీరత్వాన్ని' ఆరాధించిన లెనిన్ చౌధరి, అదే 'వీరత్వం' తన దిగువ వాళ్ళనుకున్న వాళ్ళలో కనిపిస్తే దాన్ని అణచటం నేర్చాడు. ప్రతి సిద్ధాంత కర్తకీ జనం ఎంత అవసరమో గ్రహించి జనాన్ని మెచ్చుబరచటమూ,




చల్లబరచటమూ నేర్చాడు. తన 'ఆచార్య' హోదా కల్పించిన అవకాశాలను వినియోగించటంనేర్చాడు.

దానాదీనా-

ఆయన ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనయి, 'అణచవలసిన' వాళ్ళని అణచగలిగినా మానినా, 'నడపవలసిన' వాళ్ళను తన వెంట నడపగలిగినా మానినా, తన కొడుకుని మాత్రం తన మానసిక వికారాలన్నీ పోసి పెంచాడు. ఆయన మాట పదును కొడుక్కి రాకపోయినా, చేతి విసురుమాత్రం పూర్తిగా వచ్చింది.

ఆయన తను నడపవలసిన వాళ్ళని నడవటానికి '- మాల మాదిగ నా కొడుకులని మనం ఇళ్ళలోకి రానిచ్చాం - అందాకావస్తే ఫరవాలేదు - అంతో ఇంతో మనకీ లాభమే! ఆ తర్వాత రానిస్తే - వాళ్ళొచ్చి మన పిల్లల మెడలలో తాళి కట్టడం ఖాయం -'' అన్న మాటని ఒక మంత్రంగా మార్చాడు. ఆ మంత్రం వల్ల అతనికి ఏం లాభం చేకూరిందో గాని, అది ఆయన కొడుకు మీద మాత్రం అద్భుతంగా పని చేసింది.

దాంతో -

ఆరోగ్యం ఆ కొడుకుని తన్నవలసి వచ్చింది.

OOO

భద్రాచలం కొట్టు మీదుండగా వచ్చాడో కుర్రాడు - 'చూడు భద్రాచలం - మీ వాడు లేనిపోని గొడవల్లో పడుతున్నాడు - చదువు పూర్తవదు -' అన్నాడు.

అది ఆత్మీయుడి సలహాగా భద్రాచలానికి వినిపించింది.

కొడుకుతో చెపితే - అతనికి శత్రువు హెచ్చరికలా వినిపించింది.

''హెచ్చరిక భయానికి పైలట్'' అన్నాడు.

''ఇన్నాళ్ళూ కష్టాలు పడ్డాం - ఏదో - దేవుడు సల్లగా సూశాడురా - నీ చదువు అవొస్తుంది - ప్రయోజకుడివై మాకింత గంజినీళ్ళు పోస్తావని'' ఆరంభించాడు తండ్రి.

''భయపడి- వందలాది సంవత్సరాలు బతికాం - మన వాళ్ళు భూములు సంపాదించారా? మేడలు కట్టారా?''

''బతికాం గదరా -''

''అవునవును. సందులలో పందులవలె - సబ్ హ్యూమన్‌గా -''


''అంటే-''

కొడుకు వివరించలేదు. 'ఇతర కులాల్లో వృద్ధ తరం - తమ యువతరానికి - 'ఆధిపత్యాన్ని' సంపాదించి పెట్టడానికి - కొనసాగించటానికి - ఉపయోగపడుతుంది? మనలో -?? బానిసత్వాన్ని - కొనసాగించటానికే! వీళ్ళకి నచ్చజెప్పటం మనకి మరో తలనొప్పి -' అన్నాడు మిత్రులతో!

భయం వెనకబట్టి, కాలం ముందుకు పోతున్నదని భద్రాచలం కుదుట పడుతూండగానే - పిడుగు పడింది.

నవ్వుతూ, తుళ్ళుతూ వెళ్ళిన కొడుకు అలాగే వస్తాడని ఏ తండ్రి ప్రాణం ఆశించదూ! అందుకు బదులుగా - అతను చావుబతుకుల మధ్యనున్న వార్త రావటం - పిడుగుకాక ఏమిటి!!

''నన్ను ఇమ్మాన్యూల్ అంటారండి - ఆరోగ్యం బాబంటే మాకూ మా వోళ్ళకీ దేవుడు! నా కొడుకులు టయానికి అడ్డుకోబట్టి సరిపోయింది. ఆస్పత్రిలో వున్నారు - పదండి బాబూ'' అంటూ రిక్షా కట్టించి భద్రాచలాన్నీ, నూకాలునీ, పిల్లలనీ



ఆస్పత్రికి తీసుకెళ్ళాడు.

'నువ్వెలా బతుకుతావురో కొడకా-' అంటూ ఏడ్చింది నూకాలు.

'నీ చదువు ఎలా అవుద్దిరా నాయనా -' అంటూ బాధపడ్డాడు తండ్రి.

స్పృహలోకొచ్చాక -

''ఒక వీరుడు మరణిస్తే వేయి మంది ప్రభవిస్తారు-'' అన్నాడు.

అన్న పట్ల ఆరాధన బ్రహ్మం కళ్ళలో మెరిసింది.

మరికొంత కోలుకున్నాక -

''యూనివర్శిటీ ఎవడి అబ్బ సొత్తూ కాదు. రోజులు మారాయి. ధర్మాలూ, నీతులూ చెప్పి - పబ్లిక్‌గా చెయ్యలేరు. వాడు దొంగ దెబ్బ తీస్తే మనం పబ్లిక్‌గా - జవాబిస్తాం.''

ఆస్పత్రిలో ఉన్నన్ని రోజులూ -

ఎన్నెన్నో తెలియని మొహాలు. ప్రేమతో ప్రకాశించే నయనాలు. ఆరోగ్యమూర్తి చుట్టూ కోటలా నిలబడ్డారు. ప్రతీ ఒక్కరూ తన కొడుకు పట్ల చూసే ఆత్మీయతకు భద్రాచలం 'లంకెల బిందెలు' దొరికినంత సంబరపడిపోయాడు.

ఇమ్మాన్యూల్ ఇంట్లో మనిషైపోయాడు. మనసులో మాటైపోయాడు. అతను మాదిగ. తుని దగ్గర నక్కపల్లి. భద్రాచలం ఈడువాడు. అతని ఇంటికి భద్రాచలం వెళ్ళిన రోజున ఏనుగు ఎక్కినంత సంబరపడిపోయారు. యూనివర్శిటీలో స్వీపర్ ఉద్యోగం. అతని కొడుకులు ఎవరికీ చదువు అబ్బలేదు. ఒక కొడుకు ఐ.టి.ఐ పాసై, యూనివర్శిటీలోనే ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు.

ఇమ్మాన్యూల్‌కీ అతని పిల్లలకీ 'ఆరోగ్యం బాబు' అంటే అంతులేని గురి.

కోలుకున్నాక, ఆరోగ్యం చదువు కొనసాగించాడు.

'నిన్ను కొట్టడానికి అసలు కారణం - నువ్వు నిజమైన కమ్యూనిస్టువి కావడమే' అన్నారు కమ్యూనిస్టు మిత్రులు.

'కాదేమో - నేను మాలాడిని కావటం వల్లనేమో!' అన్నారు ఆరోగ్యం.

'కానేకాదు - నీది స్వీయ మానసిక ధోరణి. నువ్వు సరిదిద్దుకోవాలి' అన్నారు మిత్రులు.

అనుమానంగా చూశాడు ఆరోగ్యం.

కొంత కాలమయ్యాక -

'నిజమైన కమ్యూనిస్టంటే?' అని అడిగాడు.

'ప్రశ్నించేవాడు'

'దేన్ని?'

'అధికారాన్ని, అణచివేతని-'

'వాటిని ప్రశ్నించడమెలా కుదురుతుంది? వాటిని ఎదిరించటమేగదా!'

'అఫ్‌కోర్సు - ప్రశ్నించటమంటే ఎదిరించటమే -'

'కాదు. ప్రశ్నించటమంటే ప్రశ్నించటమే -' అన్నాడు ఆరోగ్యం.

వాళ్ళు అతన్ని అనుమానంగా చూశారు.

'మనిషిని - రైతూగా, కూలీగా, కార్మికునిగా, పేదగా - వాళ్ళ సెంటిమెంట్స్‌తో సహా అర్థం చేసుకోటానికి, సిద్ధాంతీకరించటానికి చేసిన ప్రయత్నం - మనం - దళితునిగా, దళితుని సెంటిమెంటుతో అర్థం చేసుకోటానికి- చెయ్యలేదు-' అన్నాడు చాలా రోజులు ఆలోచించి ఆరోగ్యం.

'దళితుడంటే - ఆర్థికంగా దళితుడే! ఆర్థిక దళితుల సెంటిమెంట్స్ ఒక్కటే! నువ్వు వేరేగా ఆలోచిస్తున్నావంటే కారణం నువ్వు రాజ్యం మాయలో పడుతుండటమే! ఆర్థిక దోపిడీని సుగమం చేసేందుకే సాంస్కృతిక అణచివేత పుట్టింది - ప్లీజ్ సరిగా ఆలోచించు - లేకపోతే నీ మీద మా నమ్మకాలు, ఆశలూ పోతాయి-' అన్నారు.

'నేను ఆలోచించటం - అడగటం తప్పా?' అనుకున్నాడు ఆరోగ్యం.

వాళ్ళ చూపులూ, అనుమానాలూ ఆరోగ్యాన్ని చాలా బాధించాయి. బీజ ప్రాయంలో ఉన్న అతని అనుమానం 'తన కులమేమో!' అన్నది బలపడి - 'తన కులమే' తనకు ప్రశ్నించే అవకాశాన్ని కలిగించలేదన్న నిశ్చయానికి వచ్చాడు. అలా ప్రశ్నించజూడటం - వాళ్ళ పట్ల కృతఘ్నతగా భావిస్తున్నట్టు - అతనికి అనిపించింది.

చదువుకున్న వాళ్ళ మీద అతనికి మరిన్ని అపనమ్మకాలు కలిగాయి.

'ఈ ప్రపంచం తెలివైన వాళ్ళకోసం, తెలివైన వాళ్ళ రూల్సుతో, తెలివైన వాళ్ళు నడుపుతున్న ప్రపంచం. ఇందులో ప్రధానమైన ఆయుధం చదువు. చదువుకున్న వాళ్ళదే తెలివి. నిజానికి చదువుకున్న వాళ్ళు ఈ ప్రపంచంలో నాలుగోవంతు కూడా ఉండరు. కాని ప్రపంచ ఉత్పత్తిలో నాలుగింట మూడొంతుల భాగాన్ని ఈ అల్పసంఖ్యాకులు తమ కైవశం చేసుకుంటారు. తమ కైవశమయిన భాగాన్ని పంచుకోవటం కోసమే వీళ్ళు అన్ని సిద్ధాంతాలూ పుట్టించారు. వీళ్ళే మానవులు. వీళ్ళ మానసిక రోగాలే మనస్తత్వ శాస్త్రం. వీళ్ళలో - ఈ పంపకం కోసం - ఏర్పడిన కృతక ప్రవృత్తే మానవ ప్రవృత్తి! వీళ్ళ స్వార్థ గుణాలే - మానవజాతి ప్రాతినిధ్య గుణాలు. చదువురాని - అంటే వీళ్ళ దృష్టిలో తెలివిలేని - ప్రపంచ జనాభాలో నాలుగింట మూడొంతుల మంది - జనంలోని ... మౌలిక స్వభావాలూ, సహజ స్పందనలూ, ఒకరితో ఒకరు కూడితే తప్ప సాధించుకోలేని అనివార్యతా.. వంటివేవీ మానవ ప్రవృత్తి కాకుండా పోతాయి-' అనిపించసాగింది.

అప్పటికి ... అంత స్పష్టంగా కాకపోయినా, ఇంచుమించు ఇలాంటి అభిప్రాయానికి చేరుకున్నాడు ఆరోగ్యమూర్తి. అభిప్రాయాల మీద - చదువుకున్న వాళ్ళ పెత్తనాన్నీ - అందులో కూడా వాళ్ళ

కులాధిపత్య భావనలనీ - ఫీలవసాగాడు ఆరోగ్య మూర్తి.

అయితే - తన ఆలోచనలలో తప్పొప్పులు సరి చూసుకుని, వాటికి నైశిత్యం కూర్చుకునే అవకాశం ఆరోగ్యానికి ఆనాటి వాతావరణం ఇవ్వలేదు. తనకు దొరికిన అబ్బురమైన వస్తువుని పరిశీలిస్తూనే జీవిత మంతా గడిపే ఆదికాలపు మేధావిలా ఒంటరిగా ఉండిపోయాడు ఆరోగ్యమూర్తి.

ప్రపంచంలోని దుష్టత్వం మీద, దుష్టశక్తుల మీద తిరగబడమనే కమ్యూనిస్టు మిత్రులు చాలా రొడ్డ కొట్టుడుగా అతని ప్రశ్నా స్వభావాన్ని తప్పు పట్టడంతో - అతనికి నిరాశ కలిగింది. ఏ ప్రశ్న అడి గినా - మార్క్స్, ఏంగిల్స్, లెనిన్, మావోలను ఉటంకిస్తూ ఒక పరిభాషలో జవాబిచ్చే - వాళ్ళ పద్ధతి అతనికి అసంతృప్తి కలిగించింది. వేయి ఆలో చనలను వికసించనీయమనే మాటను గోడలకి అప్ప జెప్పి - ఒక్క ఆలోచన వెలిబుచ్చినా - దానిని రివిజ నిజమో, ఉదార వాదమో, స్వీయ మానసిక ధోరణో, పిడివాదమో - అంటూ ఒక గాడిలోకి నెట్టే ధోరణి అతన్ని చాలా కలవరపరిచింది.

దానాదీనా - 'ప్రతిదీ వేదాల్లోనే ఉందిట అంటూ కొందరు పెత్తనం చెలాయిస్తే ప్రతిదీ మార్క్సిజంలోనే ఉందిట అంటూ మరికొందరు పెత్తనం చేపట్టాలని చూస్తారు. మార్క్సిజం కూడా చదువుకున్న వాళ్ళ ఆటలో భాగమే' అనుకున్నాడు మూర్తి.


OOO

తీర్థపురాళ్ళు, సముద్రమూ... భద్రాచలంలో జ్ఞాపకాలు, ఆలోచనలు... ఆటుపోట్లుగా...

ఆరోగ్యం చదువు అవుతూండగానే లెక్చరర్ అయ్యాడు. బ్రహ్మాన్నీ, భద్రాచలాన్నీ ఊళ్ళో జరు గుతున్న సమావేశాలకు వెళ్ళొద్దనేవాడు. బ్రహ్మాన్ని పాటలు పాడొద్దన్నాడు. భద్రాచలాన్ని - ఆ పెద్దల ముందు - చేతులు కట్టుకుని నిలబడొద్దన్నాడు.

''- నాన్నా - వాళ్ళ సంగతి మీకు తెలవదు. ఆనాడు నన్ను కొట్టించిన ప్రొఫెసర్ ఏకంగా లెనిన్ చౌదరి. వాళ్ళందరిదీ ఒకటే జాతి. వాళ్ళల్లో వాళ్ళకి ఎన్ని రాజకీయాలున్నా - ఒకరినొకరు సభల్లోనూ, పత్రికలలోనూ పగలల్లా తిట్టుకున్నా - రాత్రయే సరికే గ్లాసుల దగ్గర కలిసిపోయి మనలని తిట్టుకుం టారు. మనని సంస్కరించామని అనుకుంటారు కొందరు. మనని ఏకంచేసి నడిపిస్తున్నామంటారు కొందరు. అందరూ - రిజర్వేషన్లను - మనకి బిచ్చం గా ఇచ్చామనుకుంటారు.

నేచెప్పేది వినండి - ఈ దేశం వాళ్ళది. ఈ




పట్నం వాళ్ళది. ఈ యూనివర్సిటీలు వాళ్ళవి - పార్టీలు వాళ్ళవి - చివరకి మనని ఉద్ధరిస్తారని మీరు అనుకుంటున్న నక్సలైటు పార్టీలతో సహా కమ్యూ నిస్టు పార్టీలన్నీ వాళ్ళవే! మనం వాళ్ళు చెప్పిన చోట ఉండాలి. నడవమన్నప్పుడు నడవాలి. కొందరికి మన ఓట్లు కావలిసొస్తే- కొందరికి మన రక్తంకావాలి-

వాళ్ళందరి ఏకైకాభిప్రాయమూ ఒకటే-'మనం మన అవసరాల కోసం వాళ్ళ చుట్టూ తిరుగుతాం - అవసరాలు తీరగానే వదిలేస్తాం - మన రక్తంలోనే, మన పుట్టుకలోనే ఉంది విశ్వాసహీనత. మనం మానవ ప్రవృత్తిలోనే వికార లక్షణాలకు ఆకారం...'

అన్న వంక విచిత్రంగా చూశాడు బ్రహ్మం.

'నర్రెంక చెట్టు కింద నరుడో భాస్కరుడో -' అని పాడుకుంటూ అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

కొడుకు వంక అయోమయంగా చూశాడు భద్రాచలం.

''అందరూ పెద్దాళ్ళేనంటావా ఆరోగ్యం?'' అన్నాడు.

''మన దగ్గరకొచ్చేసరికి - అందరూ ఒకటే -''

''కాదురా - చాత్రి బాబు దేవుడు-''

''ఏంవాయ్ కందుల భద్రాచలం- అంటే- నీకు నెత్తిమీద కిరీటం పెట్టినట్టుంటుంది - ఏంవాయ్ శాస్త్రీ - బావున్నావా - అని పలకరించి చూడు- ఆ పెద్ద మనిషికి కిరీటం పెట్టినట్టుండదు సరిగదా - గునపంతో పొడిచినట్టుంటుంది -''

కొడుకు అలాఅన్నప్పుడు భద్రాచలానికి కోపం వచ్చింది. బాధ కలిగింది. తన సందేహాన్ని ఎవరితో తీర్చుకోవాలో అర్థం కాలేదు.

''ఏటి తమ్ముడూ- ఈడిలా మాటాడతాడూ -'' అన్నాడు ఇమ్మాన్యుల్‌తో.

''సారు పెద్ద సదువులు సదుంకున్నోరు - మనకేం తెలుస్తుందన్నా -'' అన్నాడు ఇమ్మాన్యుల్.

''ఆరోగ్యం నీ కొడుకంటోడు - సారు సారు అనమాకు తమ్ముడూ-''

''అదంతా నీ పెద్ద మనసన్నా! మనోడుగుందా అని మనమే మరేద ఇయ్యాపోతే పయ్యోళ్ళు ఇత్తారా అన్నా!''

బ్రహ్మం మరణవార్త తెలిసినప్పుడు, ఆరోగ్య మూర్తి చంటి పిల్లాడిలా ఏడిచాడు -

''నువ్వే- నువ్వే సంపేశావు'' అంటూ తండ్రిని నిందించాడు.

''నేనా!?''

''అవును - నువ్వే! నువ్వే - వాళ్ళ వెనకాతలే తిరుగుతావు నువ్వు - అదేగొప్పనుకుని వాడూ తిరి గాడు. ఏమయింది? నేను అనుకున్నంతా అయింది. నీకు ఓపికలేదు గనక - బయటే ఉండిపోయావు - బతికి పోయావు - వాడు బలయిపోయాడు-''

గిలగిలలాడి పోయాడు భద్రాచలం...

OOO

ఆ విషయం గుర్తొచ్చినప్పుడల్లా ఆ వృద్ధుని మనసులో అదే గిలగిల! ఆలోచనలన్నీ ఆగిపోయి నట్టు సముద్రాన్నీ తీర్థపు రాళ్ళనీ కనిపించినంత మేర చూస్తూ- వినిపించినంత వింటూ అలాగే ఉండి పోయాడు.

ఆ రోజు అలా అన్నాడు కాని -

ఆరోగ్యం తననెప్పుడయినా తక్కువ చేశాడా? తన మీద తక్కువ ప్రేమ ఉందా?

**(సశేషం)**